క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. విడపనకల్లుకు చెందిన రాముడు ద్విచక్ర వాహనంపై గుత్తి నుంచి వెళ్తుండగా గుంతకల్లు రోడ్డులో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి శివారులో మంగళవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు..పెద్దొడ్డికి చెందిన రంగస్వామి, ప్రసాద్, సింహాద్రి వ్యక్తిగత పనినిమిత్తం ముగించుకొని గుత్తి నుంచి తిరిగి గ్రామానికి వెళ్తుండగా శివారులో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని మెరుగైన చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రి నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు సెల్‌ఫోన్ల రికవరీ

యల్లనూరు: యల్లనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకుపోయిన నాలుగు సెల్‌ఫోన్లలో మూడు రికవరీ అయినట్లు ఎస్‌ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు.

ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం

గుంతకల్లుటౌన్: గుంతకల్లులో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, నిల్వ, క్రయవిక్రయాలను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్‌తో తయారైన బ్యాగులు, కవర్లు, కప్‌లు, గ్లాసులు, స్పూన్లు, స్ట్రాలు, ట్రేలు, జెండాలు, ప్లేట్లు, ఇయర్‌బడ్స్, మిఠాయి కర్రలు, ఐస్ క్రీమ్ స్టిక్స్, సిగరెట్ ప్యాక్‌పై ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ నెల 26 నుంచి అన్ని రకాల ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధించినట్లు ఆయన తెలిపారు.

పన్ను వసూలుపై శ్రద్ధ చూపండి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ బండిశేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆస్తి, నీటి పన్ను వసూలుపై వార్డు కార్యదర్శులు, రెవెన్యూ, వాటర్‌వర్క్స్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న తెలిపారు. మంగళవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ వాటర్ వర్క్స్, లైటింగ్, ఇంజనీరింగ్ సిబ్బంది మస్టర్‌కు హాజరయ్యారు. అనంతరం ఆయన 19వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుంతకల్లు: పట్టణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ రంగస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వార్డుల్లో ఫాగింగ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర చర్యలు తీసుకున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఫాగింగ్ చేయిస్తున్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో అపరిశుభ్రంగా ఉన్న వార్డుల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్ రంజిత్, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఊరూరా అమ్మవారి జాతర



సుంకులమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



శివపురం పెద్దమ్మ ఆలయంలో జాతర నిర్వహిస్తున్న దృశ్యం



అలంకరణలో అంకాలమ్మ, కుంటెమ్మ అమ్మవారు

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో మంగళవారం సుంకులమ్మ దేవత జాతర ఘనంగా జరిగింది. గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి జాతరకు హాజరై సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు.

గుత్తి రూరల్: అనగానదొడ్డిలో మంగళవారం ఊరుదేవరను ఘనంగా జరిపారు. గ్రామంలో వేకువజాము నుంచి పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో జరిగిన ఊరు జాతరకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరయ్యారు.గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉపేంద్రరెడ్డి, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

శివపురంలో పెద్దమ్మ జాతర

శింగనమల: అనంతపురం – తాడిపత్రి జాతీయ రహదారిపై ఉన్న శివపురం పెద్దమ్మ స్వామి జాతరను మంగళవారం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, పెద్దమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శివపురం, సీ బండమీదపల్లి, పోతురాజుకాల్వ, పెరవలి, శింగనమల, కొర్రపాడు, రోటరీపురం, అనంతపురం, తాడిపత్రి, నార్పల నుంచి తరలివచ్చారు.

గార్లదిన్నె: గార్లదిన్నె,కొట్టాలపల్లిలో పెద్దమ్మ, కనంపల్లిలో నల్లలమ్మ జాతర నిర్వహించారు. మకర సంక్రాంతి పండుగ కనుమ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామాల్లో భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి గ్రామదేవతలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని పెద్దమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నుంచి అమ్మవారికి పూజలు, అర్చనలు చేశారు. సంక్రాంతి పర్వదినం కావడంతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పామిడి: పట్టణంలోని అంకాలమ్మ, కుంటెమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దేవతామూర్తులను వెండి, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం మధ్యాహ్నం వరకూ ఆలయ పూజారి నాగన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొదటిరోజు రాతి దూలం లాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుంకులమ్మ, పెద్దమ్మ గ్రామోత్సవం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మంగళవారం ఎస్సీ కాలనీవాసులు సుంకులమ్మ, పెద్దమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ లోని ప్రతి ఇంటి నుంచి భక్తులు బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.



భజనలు చేస్తున్న మాలధారులు



శివపురం పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు

పామిడి: పట్టణంలోని కొండూరురోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ గ్రామదేవతల జాతరను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన ఏడుగాండ్ల వృషభాలు పాల్గొన్నాయి. అనంతరం 5వేలు మందికి అన్నదానం చేశారు. న్యూకేటగిరి విభాగానికి చెందిన వృషభరాజుల రాతిదూలం లాగుడుపోటీలు బుధవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్, పసుల నాగరాజు, సుంకన్న, సుధాకర్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, సోమశేఖర్, ధను, యుగంధర్‌రెడ్డి, నగేష్, బేల్దారి నాగరాజు, జవహర్ నాగరాజు, గోవిందు, కవి నారాయణమూర్తి, ఓబయ్య, బాబా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా వృషభాలు ప్రథమ స్థానం :

జాతరను పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా డి రంగాపురానికి చెందిన జూటూరు రామచంద్రారెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ.25వేలు బహుమతి గెలుపొందాయి. రెండో స్థానంలో పుట్లూరు మండలం చిల్లామకురుకు చెందిన రైతు సుదర్శన వృషభాలు రూ.20 వేలు గెలుపొందాయి. ముచ్చుకోటకు చెందిన రైతు కాటం కృష్ణయ్య వృషభాలు రూ.15 వేలు గెలుపొందాయి. వరదాయపల్లికి చెందిన రైతు మల్లేష్‌నాయుడు వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. పెద్దవడుగూరు మండలం గంజిగుంటపల్లికి చెందిన రైతులు అనిమిరెడ్డి, నారాయణస్వామి వృషభాలు ఐదోస్థానంలో నిలిచాయి.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు గుంతకల్లు విద్యార్థి



విద్యార్థి ముబీనాకు ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు అలియన్ యూనివర్సిటీలో 23 నుంచి 26వ వరకు జరిగే సౌత్ జోన్ ఖోఖో పోటీలకు బీకామ్ విద్యార్థి ముబీనా ఎంపికయినట్లు శ్రీశంకరనంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అనుబంధ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి ముబీనా ఎంపికైనట్లు వివరించారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : యువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుత్తిఅనంతపురంలో సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, హైదరాబాద్ చెఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ముగిసింది. ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు అందించారు. టోర్నీలో 48 జట్లు పాల్గొనగా, పెద్దవడుగూరుకు చెందిన సాయి లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు కప్పుతోపాటు రూ. 30 వేలు నగదు అందించారు. రన్నర్స్ జట్టుకు రూ.20 వేలు, మెడల్స్ ప్రదానం చేశారు. నిర్వాహకులు తనీషకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాము, వెంకట్, మహేశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి,గూడూరు సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

29న జష్నే ఖ్వాజా గరీబ్ నవాజ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 29న జష్నే ఖ్వాజా గరీబ్ నవాజ్ బయాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సాయినగర్ సున్నీ మస్‌జిద్ రహ్మానియా కమిటీ సభ్యులు వెల్లడించారు. ముఖ్య అతిథిగా నాసిర్ రజాఖాన్ సాహెబ్ రజ్వి, మహమ్మద్ ఉస్మాన్ రబ్బాని, ఇబ్రహీం అలీ ఖాదరీ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

అనంతపురం సెంట్రల్: సాయినగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కణేకల్లు: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు చిక్కణ్ణేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప, కార్యదర్శి చాంద్‌బాషా, సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన సవీరా ఆస్పత్రి సౌజన్యంతో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్డియాలజీ, ఆర్థో, ఐ స్పెషలిస్ట్, గైనిక్ డాక్టర్లు రానున్నారని వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

రజకులకు న్యాయం చేస్తాం

రాప్తాడురూరల్: అనంతపురం మండలం ఆకుతోటపల్లిలోని దోబీఘాట్ విషయంలో రజకులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీధరమూర్తి హామీ ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్నతో కలిసి దోబీఘాట్ స్థలాన్ని, బోరుబావిని, నీటి తొట్టెలను, ఆయన పరిశీలించారు. రజక సంఘం నాయకులు, గ్రామస్తులు, పెద్దలను విచారణ చేశారు. 40 ఏళ్లకు పైగా ఇక్కడ దోబీఘాట్‌లో రజకులు బట్టలు ఉతికేవారని గ్రామస్తులు తెలిపారు. రికార్డులు పరిశీలించి దోబీఘాట్‌కు కేటాయించిన స్థలాన్ని కచ్చితంగా వారికే దక్కేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, సునీల్‌దత్తరెడ్డి, నారాయణరెడ్డి, ఏపీ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రూ.80 లక్షలతో గాలి గోపురాల నిర్మాణం

కూడేరు: దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధిగాంచిన శివాలయాల్లో ఒక్కటిగా పేరు గాంచిన కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర ఆలయంలో సుమారు రూ.80 లక్షలతో ఉత్తరం–దక్షిణం వైపు గాలి గోపురాలను నిర్మించనున్నట్లు నిర్మాణదాత బళ్లారికి చెందిన బసన్న గౌడ్ తెలిపారు. మంగళవారం గోపురాల నిర్మాణానికి ఉపయోగించే పెద్ద పెద్ద రాళ్లను బెంగళూరు నుంచి లారీల్లో ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆ రాళ్లకు అర్చకుడు మహేష్ పూజలు నిర్వహించారు. నిర్మాణ దాత మాట్లాడుతూ సంగమేశ్వరుడి ఆశీస్సులతో తమ సంకల్పం నెరవేరడంతో గాలి గోపురాలు నిర్మించి, మొక్కు తీర్చుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ జ్ఞానేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బోటనీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండి, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత సాధించిన వారు అర్హులన్నారు. అర్హులైనవారు ఈనెల 21న కళాశాలలో జరగనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

పశుగ్రాసం దగ్ధం

యాడికి: చింతలాయపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తూ మంగళవారం రెండు ట్రాక్టర్ల గ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన నల్లన్నగారి లక్ష్మయ్య పశువుల మేత కోసం గడ్డివామి వేసుకున్నాడు. ఆకతాయిలు గడ్డివామికి నిప్పంటించడంతో కాలిపోయింది.

మార్చి 13న 60 జంటలకు షష్టిపూర్తి వేడుక



షష్టిపూర్తి మహోత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వేగ్రౌండ్ శ్రీలక్ష్మీగణేశ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 13న 60 జంటలకు షష్టిపూర్తి శాంతి మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌గుప్త, కార్యదర్శి వీఎల్.గుప్త తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు, పరిసర ప్రాంతాలకు చెందిన 60 ఏళ్ల పైబడి 69 ఏళ్లలోపు వయసున్న హిందూ దంపతులకు వేదపండితుల ఆధ్వర్యంలో సామూహిక షష్టిపూర్తి శాంతి మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షష్టిపూర్తి జరుపుకోదలిచిన వారు ఫిబ్రవరి 15లోపు వివరాలను ఆలయ కమిటీకి అందించాలన్నారు. వివరాలకు సెల్: 9848470632, 9885869488 లో సంప్రదించాలన్నారు. ఆలయ అర్చకులు పార్థసారథి, ఆలయ కమిటీ కోశాధికారి దేవేంద్ర, సుధాకర్‌గుప్త, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సీతారాముల కల్యాణ వేడుకలు

అనంతపురం కల్చరల్: సాములదొడ్డి అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు సీతారామ కల్యాణం, సప్తాహం తదితర వేడుకలు నిర్వహించనున్నట్లు పవన సుత యువజన సంఘం కార్యకర్తలు ప్రమోద్‌స్వామి, సుంకు వేణుగోపాల్, సత్యనారాయణ, వెంకటేశ్వరప్రసాద్, శ్రీధర్, మురళి తెలిపారు. మంగళవారం వారు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఏడు రోజుల పాటు శ్రీరామ జయరామ అనే మహామంత్రం కార్యక్రమంలో 50 బృందాలు పాల్గొంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యాన పథకాలపై ఆరా

అనంతపురం అగ్రికల్చర్: అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఉద్యానశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. డీడీ బి.రఘునాథరెడ్డి, ఏడీ నరసింహారావు, హెచ్‌ఓలు రత్నకుమార్, చందన తదితరులతో సమావేశమై ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీల గురించి తెలుసుకున్నారు. జిల్లాలో పండ్లతోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల విస్తీర్ణం, పెట్టుబడులు, దిగుబడులు, మార్కెటింగ్ స్థితిగతులు, రైతుల పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం రాప్తాడు మండలంలో దానిమ్మ, బీర పంటలు, అరటి మొక్కల ల్యాబ్‌ను సందర్శించారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా సాయిప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తాడిపత్రి: పట్టణంలోని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో వైఎస్సార్ సీపీ యువనాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిపారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం కూడలిలో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం అప్పలతిప్పాయపల్లిలోని జీవనాలయంలోని మానసిక వికలాంగులు, రమణ మహర్షి అనాథాశ్రమంలోని చిన్నారుల మధ్య గంగాదేవిపల్లి సర్పంచ్ హనుమంతరెడ్డి, గన్నేవారిపల్లి ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. అక్కన్నపల్లిలోని ఝాన్సీ వృద్ధాశ్రమం, పలు ఆశ్రమాల్లో జన్మదిన వేడకలు జరిపారు.











